
నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I నల్లగొండ, గురువారం 17 ఏప్రిల్ 2025 YADADRI BHUVANAGIRI

# అటానమస్ కోసం అడ్డదారులు

- ఉమ్మడి జిల్లాలో ఐదారు ఇంజనీరింగ్ కాలేజీల ప్రయత్నాలు
- కోటి రూపాయలు పెట్టేందుకైనా వెనుకాడని వైనం
- పాస్ గ్యారెంటీ అంటూ ఇప్పటికే అడ్మిషన్ల వేట




సూర్యాపేట, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ) : పరీక్షలు సొంతంగా నిర్వహించడం, ప్రశ్నాపత్రాలు సొంతంగా తయారు చేయడం, వాల్యూవేషన్ కూడా వారే చేయడం అనేది ఇంజినీరింగ్ కళాశాలలకు కల్పించే స్వయం ప్రతిపత్తి. అలాంటి అటానమస్ హోదా కోసం పలు కాలేజీలు అడ్డదారులు వెతుకుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో దాదాపు పాతికకుపైగా ఇంజినీరింగ్ కళాశాలు ఉండగా, ఐదారు కాలేజీల యాజమాన్యాలు అటానమస్ కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. అందుకోసం కోటి రూపాయలు పెట్టేందుకైనా వెనుకాడడం లేదని విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి ఇంజినీరింగ్ అనేది వృత్తి విద్యా కోర్సు అయినందున భవిష్యత్‌లో స్థిరపడాలంటే కచ్చితంగా సబ్జెక్టుపై పట్టు ఉండాలి. ప్రైమరీ, పది, ఇంటర్మీడియట్ పరీక్షల మాదిరి దీన్ని చూస్తే భవిష్యత్‌లో స్థిరపడడానికి అవకాశం ఉండదనేది విద్యావేత్తల మాట. యూనివర్సిటీల పరిధిలో ఉండే కళాశాలలు, అటానమస్ రెండు రకాలుగా ఉంటాయి. జేఎన్‌టీయూ వంటి యూనివర్సిటీల పరిధిలో ఉండే కళాశాలలకు పరీక్షా పేపర్లు తయారీ, వాల్యుయేషన్ వంటి అంశాలు యూనివర్సిటీ పరిధిలోనే ఉంటుండగా, అటానమస్ పర్మిషన్ ఉన్న కళాశాలలకు అన్నీ వారే చేసుకునే అవకాశం ఉంది. కళాశాలల్లో ఉండే సగం కోర్సులకు నేషనల్ బోర్డ్ అక్రిడేషన్(ఎన్‌బీఏ) ఉండడం లేదా న్యాక్ అక్రిడేషన్ పొందడం ద్వారా అటానమస్ వస్తుంది. ఎన్‌బీఏ అక్రిడేషన్ పొందాలంటే సునిశిత పరిశీలన ఉంటుంది. అక్కడ ఎటువంటి పైరవీలు, దొడ్డి దారికి ఆస్కారం ఉండదు. కానీ న్యాక్ అక్రిడేషన్ పొందేందుకు మాత్రం అడ్డదారిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని ఓ ప్రముఖ యూనివర్సిటీ అటానమస్ పొందడానికి ముందు న్యాక్ కోసం లక్షల రూపాయలు లంచం ఇవ్వడం, సీబీఐ విచారణ, న్యాక్ బృందంపై దాడులు చేసి కేసులు నమోదు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని పలు కళాశాలల యాజమాన్యాలు అడ్డదారిన అటానమస్ పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అటానమస్ పేరు చెప్పి పాస్ గ్యారెంటీతోపాటు మంచి మార్కులు వస్తాయని ఎరగా చూపించి అడ్మిషన్లు చేసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇంజినీరింగ్‌లో చేరే విద్యార్థులు అటానమస్ చూడకుండా వసతులు, అధ్యాపక బృందం, బోధన ఎలా ఉన్నాయో చూసుకోవాలని, సీనియర్ విద్యార్థులతో మాట్లాడితే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని సూచిస్తున్నారు.

### విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడమే..



ఇంజినీరింగ్ కళాశాలల్లో సరిపడా వసతులు, బోధన లేకున్నా అటానమస్ కోసం తాత్కాలిక ఏర్పాట్లు చేసి దొడ్డిదారిన తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడమే అవుతుంది. ఇప్పటికే ఎంతోమంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేసి సరైన స్కిల్స్ లేక నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థుల తల్లిదండ్రులు అన్ని ఆరాలు తీసి పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం మంచి కళాశాలలను ఎంచుకోవాలి. అక్రమాలకు పాల్పడే కళాశాలలపై ఉద్యమాలు చేస్తాం.

-ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

## నేటి నుంచి జరిగే డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

రామగిరి, ఏప్రిల్ 16 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి మే 15వరకు జరుగాల్సిన డిగ్రీ పలు సెమిస్టర్ బ్యాక్ లాగ్, రెగ్యులర్ థియరీ పరీక్షలను వాయిదా వేసినట్లు ఎంజీయూ సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆందోళనలు చేస్తున్నాయి. ప్రస్తుత పరీక్షలను బహిష్కరించాయి. ఈ నేపథ్యంలో వీసీ, రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు పరీక్షలను వాయిదా వేశారు.

## ఎంజీయూలో ఉద్యోగ మేళా

రామగిరి, ఏప్రిల్ 16 : ఎంజీయూలో బుధవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించారు. హైదరాబాద్‌లోని సిస్టంస్ సంస్థ సహకారంతో జరిగిన మేళాలో ఐటీ, నాన్ ఐటీ, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ రంగాల్లో ఉద్యోగాలకు బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం పూర్తి చేసిన అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్వాహకులు తెలిపారు. రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ వై.ప్రశాంతి పాల్గొన్నారు.

# ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే..

## కేసీఆర్ ఆనవాళ్లు చెరపడం రేవంత్ తరం కాదు

- ఎవరేం చేస్తున్నారో ప్రజలకు స్పష్టంగా అర్థమైంది
- పదహారు నెలల్లో అప్పులు తప్ప సంక్షేమం లేదు
- మాయమాటలతో అధికారంలోకి.. ఆరు గ్యారెంటీలు గాలికి..
- కేసీఆర్ సీఎం కావాలని అంతా కోరుకుంటున్నారు
- చరిత్రలో నిలిచేలా రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- దేవరకొండలో రజతోత్సవ సభ సన్నాహక సమావేశం
- కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరికలు



చందంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 16 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ వైపే ఉన్నారని, తిరిగి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు సిద్ధమవుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో దేవరకొండ పట్టణంలోని విష్ణు కాంప్లెక్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరితో మొదలై నేడు లక్షలాది మంది ప్రజాభిమాన్ని చూరగొన్న పార్టీ బీఆర్‌ఎస్ అన్నారు. సీఎంగా కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే చరిత్ర సృష్టించాయని గుర్తుచేశారు. కేసీఆర్ పదేండ్ల పాలన స్వర్గయుగమంటూ ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. ఊళ్లల్లో పచ్చని చెట్లను చూస్తే హరితహారం గుర్తుకు వస్తుందని, తాగే నీటిలో మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చిన కేసీఆర్ కనిపిస్తారని పేర్కొన్నారు. తెలంగాణలో ఆయన ఆనవాళ్లను చెరిపేయడం రేవంత్‌రెడ్డి తరం కాదని తెలిపారు. హింసకు తావు లేకుండా, రాజ్యాంగ బద్ధంగా తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నిర్మాణాత్మక పాలన అందిస్తే.. రేవంత్‌రెడ్డి పాలన దుర్మార్గంగా, రాక్షసంగా నడుస్తున్నదన్నది మండిపడ్డారు. తెలంగాణకు కేసీఆర్ ఏం చేశారో, రేవంత్ ఏం చేస్తున్నాడో ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. ఆంధ్రా సీఎం చంద్రబాబు 70 శాతం కృష్ణా జాలాలను వాడుకుంటున్నా ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులు ఒక్క మాట మాట్లాడడం లేదని విమర్శించారు. తెలంగాణ చంద్రబాబు చేతుల్లోకి పోతున్నదని, బాబు, ప్రధాని మోడీ ఒక్కటై రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. అలివి కాని హామీలతో అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయని కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. పూర్తిగా విఫలమైయ్యారని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటేనే మోసగాళ్ల పార్టీ అన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఏ గ్రామ ప్రజలను కదిలించినా కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశామని ప్రజలు మదన పడుతున్నారని తెలిపారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలనే కోరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. కేసీఆర్ మాయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున్న పెట్టబడులు వచ్చాయని దీంతో తెలంగాణ అభివృద్ధిలో పయనించిదన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, రూ.2 వేల ఫించన్, రైతుబంధు, మిషన భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు, హరితహారం, మిషన్ కాకతీయ వంటి పథకాలు, కార్యక్రమాలకు కేరాఫ్, తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ అని పేర్కొన్నారు. కేసీఆర్ పెట్టిన బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్, కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్ బంద్ చేసిన రేవంత్ పాలన చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. రేవంత్ హైడ్రాతో ఇండ్లు కూల్చడం, హెచ్‌యూలో చెట్లను తొలగించి మూగజీవాలను ఆగం పట్టించడం పనులతో బ్రాండ్ అంబాసిడర్ మారారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి పాత సమస్యలను సృష్టిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించలేని స్థితిలో ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని, గ్రామాల్లో చర్చ జరుగాలని సూచించారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత ప్రజల తరుపున బీఆర్‌ఎస్ పార్టీకి ఉందన్నారు.

హామీలను విస్మరించి ఢిల్లీకి కప్పం గడుతున్న రేవంత్ సర్కార్‌కు బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ చెంపపెట్టులా మారుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక అవుతుందని తెలిపారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్‌ఎస్ రజోత్సవ సభను పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తమ ఇంట్లో పండుగలా భావించి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రజతోత్సవ సభ సంబురాలు అంబరాన్నంటాలని పిలుపునిచ్చారు. అనంతరం చందంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్, బిల్యా నాయక్, రమావత్ తులసీ రాం నాయక్, వడ్త్యా రమేశ్‌నాయక్, గాజుల అంజనేయులు, పల్లా ప్రవీణ్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి, చింతపల్లి సుభాశ్, రమావత్ దస్రూనాయక్, కేసాని లింగారెడ్డి, రాజనేని వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని వివిధ మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### కేసీఆర్‌తోనే ప్రజలకు భరోసా



'కేసీఆర్ లేకుంటే తెలంగాణ రాష్ట్రమే వచ్చేది కాదు. స్వరాష్ట్రంలో ప్రజల నమ్మకం వమ్ము కాకుండా ఆయన బంగారు తెలంగాణ నిర్మాణం చేపట్టారు. ప్రజా రంజక పాలనతో దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దారు. 2000 సంవత్సరంలో పిడికెడు మందితో ప్రారంభించిన టీఆర్‌ఎస్ నేడు పాతికేండ్లకు చేరుతూ బీఆర్‌ఎస్‌గా రజతోత్సవం జరుపుకొంటున్నది. చావు నోట్లో తల పెట్టిన రాష్ట్రం సాధించిన కేసీఆర్ నాయకత్వంలో సభ్యులుగా ఉండడం గర్వకారణం. 16 నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు. ఏ గ్రామానికి వెళ్లినా రేవంత్ పాలనను ఛీ కొడుతున్నారు. రాబోయే రోజులు బీఆర్‌ఎస్‌వే. వరంగల్‌లో 1,200 ఎకరాల్లో ఏర్పాటుస్తున్న బీఆర్‌ఎస్ సభా ప్రాంగణం 25 పరేడ్ గ్రౌండ్స్‌తో సమానం. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి ఇంటి నుంచి పాల్గొని సభను సక్సెస్ చేయాలి.

-రమావత్ రవీంద్రకుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే

### సంబురాలు అంబరాన్నంటాలి



'కేసీఆర్ పదేళ్ల పాలన స్వర్ణయుగం. ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు. తెలంగాణలో భవిష్యత్ బీఆర్‌ఎస్ పార్టీదే. రజతోత్సవ సభ సంబురాలు అంబరాన్నంటాలి. కాంగ్రెస్ అతవర్గాల ప్రజలను ఇబ్బందులు పెడుతున్నది. పదహారు నెలల్లో రూ.1.58 లక్షల కోట్ల అప్పు చేసింది. దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ ఇంత స్వల్పకాలంలో ఇంత అప్పు చేయలేదు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజా సమస్యలపై పోరాడాలి.

-ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్సీ



దేవరకొండలో బీఆర్‌ఎస్ సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, ఏప్రిల్ 16 : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. చిట్యాలలోని లక్ష్మీ గార్డెన్స్‌లో బుధవారం ఆ పార్టీ ముఖ్యనాయకులతో సన్నాహక సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలను ఎదురొడ్డి తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ పదేండ్లు అహర్నిశలు కష్టపడి అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 16 నెలల పాలనలో అన్ని రంగాల్లో అధోగతి పాలు జేసిందని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులోనూ విఫలమైందన్నారు. రైతులు, చేనేత కార్మికులు, రిక్షా కార్మికుల ఆత్మహత్యలను పట్టించుకోని ప్రభుత్వం స్వలాభం కోసం ప్రభుత్వ భూముల అమ్మకానికి సిద్ధమైందని విమర్శించారు. పైగా అక్రమ కేసులు, నిర్బంధాలతో బీఆర్‌ఎస్ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని, ఎవరూ భయపడవద్దని సూచించారు. బీఆర్‌ఎస్ ఉద్యమాల నుంచి వచ్చిన పార్టీ అని, మనకు పోరాటం కొత్తేమీ కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతగా విసిగెత్తారనేది కాంగ్రెస్ సర్వేల ద్వారానే తేలిపోయిందన్నారు. ప్రజల కోసమే నిరంతరం పాటుపడే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జడల ఆది మల్లయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఐలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, నాయకులు కొలను వెంకటేశం, సుంకరి యాదగిరి, రాచకొండ కిష్టయ్య, దేవరపల్లి సత్తిరెడ్డి, మెండె సైదులు, కొలను సతీశ్, ఆగు అశోక్, కోయగూర నర్సింహ, పలువురు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ జోరు.. సర్కారులో బేజారు..

- పీపీసీలో నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు
- బయట 20వేల మెట్రిక్ టన్నుల వడ్లు విక్రయం
- ప్రభుత్వ సెంటర్లలో కేవలం 4వేల మెట్రిక్ టన్నులే..
- వాన భయంతో ప్రైవేటులో అమ్ముకుంటున్న రైతులు
- క్వింటాకు రూ.300 నుంచి 500 వరకు నష్టం



ఆత్మకూరు (ఎం) మండలం కాప్రాయపల్లిలో పీపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో పేరుకుపోయిన ధాన్యం రాశులు..

సర్కారు నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. ఇప్పటికే సరిపడా సాగునీరు అందక వేల ఎకరాల్లో పంటలు ఎండిపోగా.. చేతికొచ్చిన అరకొర ధాన్యానికి కూడా మద్దతు ధర దక్కడం లేదు. ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ప్రారంభించినా కొనుగోళ్లు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు మద్దతు ధర కన్నా తక్కువ రేటు వస్తున్నా విధిలేక ప్రైవేట్ వ్యాపారులకు అమ్మకుంటున్నారు.

– యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ)

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 2.80లక్షల ఎకరాల్లో రైతులు వరి వేశారు. మొత్తంగా 6.5లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నాలుగున్నర లక్షల టన్నుల వడ్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిల్లాలో 324 పీపీసీలను(ధాన్యం కొనుగోలు కేంద్రాలు) ప్రారంభించాలని ప్రతిపాదించారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు 212 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. అయినా 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. అనేక చోట్ల కేంద్రాలు ప్రారంభించినా.. కొనుగోళ్లలో జాప్యం నెలకొంది. దాంతో కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ పోసిన ధాన్యం అక్కడే కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

### ప్రైవేట్‌లో భారీగా..

కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంతో రైతులు కేంద్రాల్లోనే నిరీక్షిస్తున్నారు. ఇటీవల వరుసగా ఈదురుగాలులతో వర్షాలు కురుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో వందల ఎకరాల్లో పంట దెబ్బతింది. కొన్నిచోట్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. దాంతో రైతులు ధాన్యాన్ని వెంటనే అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరణ ఆలస్యం కావడంతో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేట్‌లో రూ. 1,800 నుంచి రూ.2వేల వరకు మాత్ర మే ధర వస్తున్నది. ఆత్మకూరు (ఎం) మండలంలో రూ.1,750 మాత్రమే అందుతున్నది. ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటా రూ.2,320 మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ప్రైవేట్‌లో వ్యాపారులు 20,004 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు. ఆలేరు మార్కెట్ యార్డు పరిధిలో 631మెట్రిక్ టన్నులు, భువనగిరిలో 1010, చౌటుప్పల్‌లో 2349, మోత్కూరులో 750, వలిగొండలో 15,264 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. సీఎంఆర్ తక్కువగా ఉన్నవాళ్లు మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసి సర్దుబాటు చేసుకుంటున్నారు.

**ప్రైవేట్‌లో కొనుగోళ్లు ఇలా.. (మెట్రిక్ టన్నుల్లో..)**

| మార్కెట్ యార్డు | ధాన్యం |
|---|---|
| ఆలేరు | 631 |
| భువనగిరి | 1010 |
| చౌటుప్పల్ | 2,349 |
| మోత్కూరు | 750 |
| వలిగొండ | 15,264 |
| మొత్తం | 20,004 |

### కష్టాల ఎవుసం..

జిల్లాలో పదేండ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. భూగర్భ జలాలు పడిపోయాయి. సర్కారు అలసత్వంతో చెరువులు, బోరుబావులు ఎండిపోయాయి. దాంతో సాగు నీటికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. అనేక చోట్ల పొట్ట దశలోనే పంటలు ఎండిపోయాయి. చేతికొచ్చిన మిగిలిన పంట కూడా సరిగ్గా కొనకపోవడంతో ప్రైవేట్ మిల్లుల వద్ద అమ్ముకోవాల్సి పరిస్థితి ఎదురవుతున్నది. ఫలితంగా క్వింటాకు రూ.300 నుంచి 500 వరకు నష్టపోవాల్సి వస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

### కొనుగోలు కేంద్రం లేక రూ.30వేలు నష్టం

నా పొలంలో 87 బస్తాల వడ్ల దిగుబడి వచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్‌లో క్వింటా రూ.1,800 చొప్పున దళారీకి అమ్మాను. సుమారు 30 వేల నష్టం వాటిల్లింది. గతంలో కంచనపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం పెట్టేవారు. ఈసారి ఏర్పాటు చేయలేదు.

-దేగల పాండరి, రైతు, కంచనపల్లి గ్రామం, వలిగొండ మండలం





తుర్కపల్లి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

## బీఆర్‌ఎస్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం

- పల్లెలను బాగుచేసిన ప్రభుత్వాన్ని దూరం చేసుకున్నామని బాధ పడుతున్న జనం
- రజతోత్సవ సభకు సమన్వయంతో తరలిరావాలి
- ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

తుర్కపల్లి, ఏప్రిల్ 16 : బీఆర్‌ఎస్ పదేండ్ల పాలన సంక్షేమానికి స్వర్ణయుగమని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజత్సోవ సభ విజయవంతానికి మండల కేంద్రంలో బుధవారం ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం చేశారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డితో కలిసి మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని పండుగగా మార్చారన్నారు. నాణ్యమైన 24 గంటల విద్యుత్, ఐతుబంధు ఇవ్వడంతో రైతు రికార్డు స్థాయిలో ధాన్యం పండించారని గుర్తుచ ఏశారు. గతంలో ఎడారిగా ఉన్న ఆలేరు నియోజకవర్గానికి కొండపోచమ్మ రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలు తెచ్చి తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లో చెరువులు కుంటలు నింపి సస్యశ్యామలం చేశారన్నారు. గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని వదులుకుని తప్పు చేశామనే భావనలో ప్రజలు ఉన్నారన్నారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు మండల ముఖ్య నాయకులు, గ్రామ స్థాయి నాయకుల సమన్వయంతో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, మండల సెక్రటరీ జనరల్ శ్యాగర్ల పరమేశ్, మండల మహిళాధ్యక్షురాలు శోభ, మాజీ ఎంపీపీలు బూక్యా సుశీలారవీందర్, బబ్బూరి రవీంద్రనాథ్‌గౌడ్, గజం ఉప్పలయ్య, సోషల్ మీడి యా నియోజకవర్గ కన్వీనర్ నల్ల శ్రీకాంత్, రాసాల ఐలేశ్, మాజీ సర్పంచ్‌లు కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, పోగుల ఆంజనేయులు, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, మల్లప్ప, మాజీ ఎంపీటీసీలు పలుగుల నవీన్‌కుమార్, గిద్దె కర్ణాకర్, చాడ కర్ణాకర్‌రెడ్డి, రాజయ్య, పనగట్ల లక్ష్మణ్, వెంకటేశ్, శ్రీకాంత్, భాస్కర్‌నాయక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు రెహమత్ షరీఫ్, ఎండీ యాకుబ్ పాల్గొన్నారు.